

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గం అల్లువాడలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పరమేశ్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కొమరాడ మండలం పెదశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరమేశ్ రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు ఆధారాలతో సహా ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమవగా, దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం విచారణ చేపట్టి పరమేశ్‌ను సస్పెండ్ చేసింది.

నేడు ఉగాది

- ఘనంగా పండగ నిర్వహణకు జిల్లా వాసులు సిద్ధం
- శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు సన్నద్ధమవుతున్నారు. ఉదయం 6.15 గంటల నుంచి ఉదయం 8.15 గంటల పండగ జరుపుకోవాలని కొన్ని పంచాంగాలు సూచిస్తుండడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పూజ సామగ్రి, ఉగాది పచ్చడికి అవసరమైన మామిడి కాయలు, వేపపువ్వు, ఇతరత్రా వాటిని కొనుగోలు చేశారు. మామిడాకుల తోరణాలు, వివిధ రకాల పూలు, పండ్లు తదితర వాటిని సమకూర్చుకున్నారు. ఇదిలా ఉండగా పండగ పురస్కరించుకుని జిల్లాలో మార్కెట్లన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. రైతులు ఏరువాకకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రకృతి అనుకూలించాలని కోరుకుంటున్నారు. మరికొందరు తమ రాశిఫలాలను తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇంకొందరు ఉగాది రోజున ఇష్టదైవ దర్శనంతో పాటు పండితుల ఆశీర్వాదాలు పొందడం, ఇతరత్రా శుభకార్యాలు చేపట్టనున్నారు. మరోవైపు పంచాంగ శ్రవణం కార్యక్రమాలకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు పోలమాంబ ఆలయంలో పంచాంగ శ్రవణం

మక్కువ/సాలూరు రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన శంబర పోలమాంబ చదురుగుడి ఆవరణలో మంగళవారం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పండితుడు బంకుపల్లి లక్ష్మీ నారాయణశర్మ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరం పంచాంగ శ్రవణం కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇక జిల్లాలో వీరఘట్టం, భామిని, గరుగుబిల్లి, సాలూరు మండలాల్లోని పలుచోట్ల సోమవారం రాత్రి ముందస్తుగానే పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామ పురోహితులు కొత్త సంవత్సరంలో రాశి ఫలాలను చదివి వినిపించారు.



సాలూరు రూరల్: మామిడిపల్లిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు
కఠిన చర్యలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ , నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలన్నారు. రానున్న పది రోజులు ఎంతో కీలకమని, ప్రతి అంశంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్నికలకు నియమించిన ప్రతి బృందం సూక్ష్మ పరిశీలన చేయాలని, నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్న ఉద్యోగులను కూడా గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు నలుగురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని ఆయన చెప్పారు.

పటిష్ఠ నిఘా

ఎన్నికల్లో భాగంగా నగదు, మద్యం, సారా, మాదక ద్రవ్యాలు, హింస, ప్రలోభాలు వంటి అంశాలపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. వాటిపై గట్టి నిఘా ఉండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుంటూ వ్యవహరించాలని స్పష్టం చేశారు. అన్ని బృందాలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వాహనాలకు ఎన్నికల కమిషన్ విధుల స్టిక్కర్లు అతికించాలని సూచించారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 12, 13, 15 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాని ఆదేశించారు. అనంతరం సీతంపేట, పార్వతీ పురం ఐటీడీఏ పీవోలు కల్పనాకుమారి, విష్ణుచరణ్, ఆర్డీవోలు హేమలత, వి.వెంకటరమణ తదితరులు తమ నియోజకవర్గాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఎస్‌డీసీఆర్‌వీ సూర్యనారాయణ, పార్లమెంట్ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి కె.రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



ఒట్టి మాటలేనా..?

- జలాశయాల ఆధునికీకరణను పట్టించుకోని వైసీపీ సర్కారు
- జైకా నిధులు మంజూరైనా.. పనులు పూర్తి చేయించలే..
- సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- రెండు ప్రాజెక్టులకు గడువు పూర్తి
- వట్టిగెడ్డకు ఇంకా నాలుగు నెలలే సమయం
- ఇప్పటివరకు 20 శాతానికి మించని పనులు
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై రైతుల పెదవి విరుపు



వట్టిగెడ్డ ప్రాజెక్టు

(జియ్యమ్మవలస)

'సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతాం.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం..' అని ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం చెబుతూ వచ్చింది. అయితే జిల్లాలో పూర్తిస్థాయిలో అయకట్టుకు సాగునీరందించే ప్రాజెక్టుల ఆధునికీకరణపై మాత్రం శీతకన్ను వేసింది. కనీస స్థాయిలో పనులు చేయించలేకపోయింది. జైకా నిధులు మంజూరైనా.. సకాలంలో బిల్లులు చెల్లించలేకపోయింది. మరోవైపు అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో ఏటా రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఆధునికీకరణ విషయంలో జిల్లాలో రెండు ప్రాజెక్టుల గడువు పూర్తయింది. మరో రెండు ప్రాజెక్టులకు సంబంధించి నాలుగు నెలలు, ఏడాది సమయం మాత్రమే ఉంది. ఇప్పటివరకు చేపట్టిన పనులు 20 శాతం లోపలే ఉండగా.. మరోవైపు ఎన్నికల సమయం కావడంతో గడువులోగా మిగతా నిర్మాణాలు పూర్తవడం ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంగా వైసీపీ సర్కారు 'మన్యం'లో సాగునీటి ప్రాజెక్టులపై పెద్దగా దృష్టి సారించకపోవడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వట్టిగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల ఆధునికీకరణ కోసం ఎన్నో ఏళ్ల నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే 2016-17లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ నాలుగు ప్రాజెక్టుల పరిశీలనకు నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ బృందం పలుమార్లు సందర్శించింది. ఆ తరువాత 2018లో జపాన్ నుంచి వచ్చిన ఇంజనీరింగ్ బృందం ప్రాజెక్టుల ఆధునికీకరణ విషయంపై అప్పటి టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని వెళ్లిపోయింది. ఈ మేరకు జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా), ఏపీ ఇరిగేషన్ అండ్ లైవ్లీహుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం-2 సంయుక్తంగా ఈ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. జైకా నిధులు పర్యవేక్షణ బాధ్యత ఏఇరిగేషన్ అండ్ లైవ్లీహుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం-2దే. అయితే 2019 ఫిబ్రవరిలో జైకా నిధులు మంజూరయ్యాయి. కాగా వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులకు 24 నెలలు గడువు అయితే పెద్దగెడ్డ, పెదంకలాం ప్రాజెక్టుల పనులు పూర్తికి 18 నెలలే గడువు ఇచ్చారు. కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే.. ఇప్పటివరకు కనీసం 20 శాతం పనులు జరగలేదు. ఒక్క వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులను రాష్ట్ర కాంట్రాక్టర్ చేస్తుంటే, మిగిలిన మూడు ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రం వారు చేస్తున్నారు. జిల్లాలో పెదంకలాం, పెద్దగెడ్డ ప్రాజెక్టుల ఆధునికీకరణ పనుల గుడువు పూర్తయ్యింది. మరిప్పుడు ఏమి చేయాలో అధికారులకు సైతం అర్థం కావడం లేదు. ఆయా ప్రాజెక్టుల పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

వట్టిగెడ్డ రిజర్వాయర్ ఇలా..

వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామం వద్ద నిర్మించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం 2019, జనవరి 8న రూ. 44.85 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. 2020, ఆగస్టు 19న సాంకేతిక ఆమోదం లభించింది. శ్రీసాయిలక్ష్మీ కనస్ట్రక్షన్, విజయవాడ వారు 2021, జనవరి 8న నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం పనులు ప్రారంభించారు. అయితే 2023, జూన్ నాటికి కేవలం 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. 2023, జనవరి 7 నాటికి అంటే రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనులు నత్తనడకన సాగుతుండటంతో 2024, జూలై 7 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అంటే ఇంకా నాలుగు నెలలే గడువు ఉంది. రెండేళ్లలో 15 శాతం పనులు చేసిన కాంట్రాక్టరు ఈ నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయడం సాధ్యమేనా అనేది ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.

వెంగళరాయసాగర్..

వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) ప్రాజెక్టు సువర్ణముఖి నదిపై సాలూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద ఉంది. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా మూడు మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీరందేలా డిజైన్ చేశారు. మక్కువ మండలంలో 14,550 ఎకరాలకు, బొబ్బిలి మండలంలో 6,427 ఎకరాలకు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే దీని ఆధునికీకరణ పనులకు రూ. 63.50 కోట్లతో 2019 ఫిబ్రవరి 15న పరిపాలనా ఆమోదం లభించింది. 2020 జూలై 11న సాంకేతిక ఆమోదం లభించింది. తెలంగాణ రాష్ట్రం సూర్యపేటలో ఉన్న ఎం/ఎస్ ఎస్‌కే ఆర్ కనస్ట్రక్షన్, ఎం/ఎస్ రాజ్‌పద్మ ఇన్ కార్పొరే షన్‌లతో 2020, ఏప్రిల్ 26లో రూ. 48.90 కోట్లతో అగ్రి మెంట్ కుదిరింది. వాస్తవానికి 2023, ఏప్రిల్ 25 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఇంతవరకు కేవలం 21 శాతం పనులే పూర్త య్యాయి. అయితే దీనిని పూర్తి చేసేందుకు 2025, మార్చి 24 వరకు గడువు ఉంది.



పెద్దగెడ్డ ప్రాజెక్టు

పెద్దగెడ్డ..

పాచిపెంటలో ఉన్న పెద్దగెడ్డ ప్రాజెక్టు ద్వారా పాచిపెంట మండలంలో 6,039 ఎకరాలు, సాలూరు మండలంలో 2,839 ఎకరాలు, రామభద్రపురం మండలంలో 3122 ఎకరాలకు సాగునీరందుతోంది. మొత్తంగా మూడు మండలాల పరిధిలో 12 వేల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు గాను 2019, ఫిబ్రవరి 15లో రూ. 28.18 కోట్లతో పరిపాలన ఆమోదం లభించింది. 2020, మే 22లో సాంకేతిక ఆమోదం లభించింది. ఈ పనులు చేయడానికి గాను హైదాబాద్ తార్నాకకు చెందిన ఎం/ఎస్ జీవీవీ - వైఎంఎంఆర్ (జేవీ) ముందుకొచ్చింది. రూ. 23.83 కోట్లతో ఆధునికీకరణ చేసేందుకు గాను 2020 జూలై 5న ఒప్పందం జరిగింది. వాస్తవానికి 18 నెలల్లో ఆ పనులు పూర్తికావాల్సి ఉంది. కానీ నిర్దేశిత గడువుకు 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. వాస్తవానికి 2023, డిసెంబరు 31 నాటికే ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ తుది గడువు.

పెదంకలాం..

ఈ ప్రాజెక్టు సీతానగరం మండలం పెదంకలాం గ్రామం వద్ద ఉంది. దీని ద్వారా రెండు మండలాల్లో 8,253.47 ఎకరాలకు సాగునీరందుతుంది. జిల్లాలోని బలిజిపేట మండలంలో 6617.16 ఎకరాలకు, విజయనగరం జిల్లాలోని వంగర మండలంలో 1636.31 ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం ఉంది. దీని ఆధునికీకరణకు గాను 2019, ఫిబ్రవరి 15న రూ. 17.30 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. 2020, జూన్ 22లో సాంకేతిక ఆమోదం కూడా లభించింది. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు తెలంగాణ రాష్ట్రం సూర్యపేటలో ఎం/ఎస్ ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్, ఎం/ఎస్ రాజ్‌పద్మ ఇన్ కార్పొరేషన్ సంయుక్తంగా ముందు కొచ్చాయి. ఈ మేరకు నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2023, డిసెంబరు 31 లోపు పనులు చేయాల్సి ఉంది. అయితే కేవలం 5 శాతం పనులు మాత్రమే గడువు నాటికి జరగడం విశేషం. మొత్తంగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా ఈ ఏడాది జనవరి నుంచి ఆధునికీకరణ పనులు చేయిస్తామని చెప్పుకొచ్చిన నీటి పారుదల శాఖ అధికారులు కూడా చొరవ చూపలేదు. దీంతో కాంట్రాక్టర్లు కూడా స్పందించడం లేదు. బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో ఆశించిన స్థాయిలో పనులు సాగడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులిచ్చాం..

జిల్లాలో ప్రాజెక్టుల ఆధునికీకరణకు సంబంధించి కాంట్రాక్టర్లకు వర్క్ రివిజన్ నోటీసులు ఇచ్చాం. త్వరలో పనులు ప్రారంభిస్తారు. వారు ఇంతవరకు చేసిన పనులకు రూ. 8 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని క్లియర్ చేస్తాం.

-వైవీ రాజరాజేశ్వరి, సూపరింటెండెంట్ ఇంజనీర్, నీటి పారుదలశాఖ

ఉపాధి మేట్లకు వల

- వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయాలని లోపాయికారిగా క్షేత్ర సహాయకుల ఆదేశాలు


గరుగుబిల్లి: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కొంతమంది అధికార పార్టీ నేతలు, క్షేత్ర సహాయకులు పల్లెల్లో ఉపాధి హామీ మేట్లుకు వల వేస్తున్నారు. వైసీపీకి అండగా ఉంటూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలంలోని పలు పంచాయతీల పరిధిలోని కొంతమంది క్షేత్ర సహాయకులు మేట్లుకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వైసీపీని రెండో ధపా గెలిపిస్తే మరిన్ని పథకాలు అందుతాయన్న విషయాన్ని వేతనదారులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం పని తక్కువగా చేసినా వేతనం అధికంగా వేయిస్తామని వేతనదారులకు సమాచారం అందించి ప్రచారాల్లో పాల్గొనేలా చూడాలని చెబుతున్నారు. ఈ మేరకు కొంతమంది మేట్లు ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో గట్టుచప్పుడు కాకుండా వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్నారు. తాజాగా క్షేత్ర సహాయకుల ఆదేశాలతో కొందరు మేట్లుతో పాటు ఉపాధి క్షేత్ర సహాయకులు, వలంటీర్లు, మహిళా సమాఖ్య సంఘాలు కూడా లోపాయికారిగా అధికార పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. గరిష్ట ఉపాధి వేతనం రూ. 300 మేర ఇచ్చేందుకు సీఎం జగన్ కృషి చేశారని పని ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పని చేసినా, చేయక పోయినా రూ.250 వేయిస్తామని గుట్టు చప్పుడు కాకుండా వేతనదారులకు సమాచారం చేరవేస్తున్నారు.

- **బయటపడకుండా..**

గ్రామస్థాయిలోని క్షేత్ర సహాయకులు, వలంటీర్లు, గ్రామైక్య సంఘాల వారు ప్రచారంలో పాల్గొనరాదని అధికార పార్టీకి చెందిన నేతలు సూచిస్తున్నారు. అయితే ఎన్నికల్లో అధికంగా వైసీపీకి ఓట్లు పడేలా చాపకింద నీరులా ప్రచారం చేయాలని ఆదేశాలిస్తున్నారు. కాగా సంబంధిత అభ్యర్థులు ప్రచారాలకు వచ్చిన సమయంలో క్షేత్ర సహాయకులు ఇంటి నుంచే ఈ తతంగాన్ని రిమోట్ చేస్తున్నారు. క్షేత్ర సహాయకుల వలలో చిక్కుకున్న కొంతమంది మేట్లు ఈ ప్రచారానికి ఇష్టం లేకపోయినా తల ఊపాల్సి వస్తోంది. ఏదేమైనా కొన్నిచోట్ల క్షేత్ర సహాయకులు విధులను విస్మరించి ఏకంగా అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించడంతో వేతనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా... అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు నెలకొన్నాయి. దీనిపై ఎన్నికల సంఘం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇప్పుడెలా?



- జీడి వ్యాపారులకు ఎన్నికల సెగ
- రూ.50 వేలకు మించితే అధికారులకు లెక్క చెప్పాల్సిందే..
- పెద్దమొత్తంలో నగదు తీసుకెళ్లలేని వైనం
- జీడి పిక్కలను కొనుగోలు చేయలేని పరిస్థితి..

సీతంపేట: ఏజెన్సీ ప్రాంతంలో ఈ ఏడాది జీడిపిక్కల దిగుబడి ఆశాజనకంగా ఉంది. అయితే వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి వ్యాపారులకు ఏర్పడింది. ఎన్నికల నిబంధనలే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. పెద్దమొత్తంలో నగదును తీసుకెళ్లలేక.. జీడిపిక్కలను కొనలేక.. మల్లగుల్లాలు పడుతున్నారు. మొత్తంగా జీడి వ్యాపారులు ఇరకాటంలో పడ్డారు.

- **ఇదీ పరిస్థితి..**

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 25 వేల హెక్టార్లలో జీడి సాగవుతోంది. ఈ ఏడాది దిగుబడి కూడా బాగానే ఉండగా.. ఉగాది నేపథ్యంలో జీడి పిక్కల కిలో ధరను రూ. 103గా నిర్ణయించారు. గిరిజనుల నుంచి స్థానిక వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల వారికి కమిషన్ ప్రాతిపదికన అమ్మకాలు చేపడతారు. శ్రీకాకుళం జిల్లా పలాస, చాపర, మెళియాపుట్టితో పాటు పశ్చిమ బెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన వారు ఏటా సీతంపేట ఏజెన్సీకి వచ్చి స్థానిక వ్యాపారుల నుంచి క్వింటాళ్ల లెక్కన జీడి పిక్కలు కొనుగోలు చేస్తారు. అయితే ఈ ఏడాది కూడా అదే విధంగా జీడి పిక్కలు కొనుగోలు చేయాలనుకున్న ఆయా ప్రాంత వ్యాపారులకు ఎన్నికల సెగ తగిలింది. సీతంపేట ఐటీడీఏ సుమారు 10 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటి మీదుగా వచ్చే జీడి వ్యాపారులు తప్పనిసరిగా నగదు, జీడి పిక్కల బస్తాల లెక్కలు చూపించాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో జీడి వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. వాస్తవానికి జీడిపిక్కలు కొనాలంటే సంబంధిత వ్యాపారులకు జీఎస్‌టీ తప్పనిసరి చేశారు. అయితే కొన్ని పరిస్థితుల్లో జీడి పిక్కలను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీడిపిక్కలు కొనుగోలుకు లక్షలాది రూపాయలు అవసరమైన తరుణంలో ఎన్నికల్లో నిబంధనలకు వ్యాపారులకు అడ్డంకిగా మారాయి. కాగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సేకరించే జీడిపిక్కలను సీతంపేట, కొత్తూరు, పాలకొండలో అమ్మకాలు చేపడుతున్నారు. ఇదే సమయంలో వ్యాపారులు వెంటనే నగదును చెల్లించాల్సిన అవసరం ఉంది. అయితే పెద్ద మొత్తంలో నగదు నిల్వలు ఉంచలేని పరిస్థితి. బ్యాంకుల్లో రూ.50 వేలకు నగదు లావాదేవీలు జరపాలన్నా.. దానికి అవసరమైన పత్రాలు అందు బాటులో ఉంచాల్సిన నేపథ్యంలో జీడి వ్యాపారులు తలలు పట్టుకుం టున్నారు. కాగా ఐటీడీఏ పరిధిలో ఏటా రూ.20 నుంచి రూ. 50 కోట్ల వరకు, ఒక్క సీతంపేట మండలంలోని రూ. ఐదు కోట్ల మేర జీడి వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారి గీతాంజలిని వివరణ కోరగా.. వ్యాపారులతో పాటు ఎవరైనా రూ.50 వేలకు మించి నగదుతో పట్టుబడితే దానికి సంబంధించి పూర్తి పత్రాలు చూపించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని తెలిపారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

- టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి సత్య
- విశాఖలో ఉత్తరాంధ్ర అభ్యర్థులతో సమావేశం

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య సూచించారు. సోమవారం విశాఖలో పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచే యాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు సూచించారు. ప్రజల భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల బరిలోకి దిగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణారంగారావు, టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కె.శ్రావణ్ , ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు బోనెల విజయచంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, తోయక జగదీశ్వరి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఏఎంసీ మాజీ చైర్మన్ డి.రామకృష్ణ , ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, మాజీ ఎంపీపీ పి.తిరుపతిరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డి.లక్ష్మణరావు, పాలకొండ నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం టీడీపీ అభ్యర్థి విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవి తదితరులు

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

● వ్యాన్‌పై విరిగిపడిన తాటిచెట్టు ● ఇద్దరికి గాయాలు
● సురక్షితంగా బయటపడిన పది మంది ప్రయాణికులు



తాటిచెట్టు పడడంతో నుజ్జునుజ్జైన వ్యాన్ ముందుభాగం

గుర్ల: గుర్ల పోలీసుస్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది.రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ తాటిచెట్టు ఆ మార్గంలో వెళ్తున్న వ్యాన్‌పై ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అందులో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం మేరకు..విజయనగరం నుంచి చీపురుపల్లి ప్రయాణికులతో వ్యాన్ వెళ్తోంది. ఒక్కసారిగా డ్రైవర్ ముందు భాగంఉన్నచోట తాటిచెట్టు పడింది.దీంతో అందులోఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్‌కు, ముందుసీటులో కూర్చున్న అప్పన్న, రాములకు స్వల్ప గాయాలయ్యాయి.మిగతా పదిమంది ప్రాణాలతో బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు. వ్యాన్‌పై చెట్టుపడడంతో రోడ్డు మీద వెళ్తున్న స్థానికులు ఒక్కసారిగా వాహనాలు ఆపి అందులో ప్రయాణం చేస్తున్న వారిని బయటకుతీశారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు చెట్టును, వాహనాన్ని పక్కకుతీశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో వాహనాలు రాకపోకలు సాగించాయి. కాగా రోడ్డుకు ఆనుకుని కాలంతీరిన తాటిచెట్లు ఎక్కువగా ఉన్నాయి. గాలులు వీచినప్పుడు, వర్షం కురిసే సమయంలో పై నుంచి విరిగిపడుతున్నాయి. తక్షణమే రోడ్డుకు ఆనుకున్ని కాలంతీరిన చెట్లను తొలగించాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేగేటుకు, మానాపురం రైల్వే గేటుకుమధ్యలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని మహిళను రైలు ఢీకొనడంతో ఆమె మృతిచెందింది. విజయనగరం రైల్వే ఎస్‌ఐ రవివర్మ కథనం మేరకు.. గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సుగల మహిళ మృతిచెందింది. అయితే రైలు నుంచి జారిపడిందా, పట్టాలు దాటే క్రమంలో జరిగిందా అనేది తెలియాల్సిఉంది. మృతురాలు వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతురాలు నలుపురంగు గౌను, ఎరుపు, నలుపు గడులు గల ఫుల్ హ్యాండ్ షర్టు, నీలంరంగు షార్టు, ఎరుపురంగు జాకెట్టు ధరించి ఉంది. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089, 9491813163 నంబర్లకు సంప్రదించాలి.

వృద్ధుడు చికిత్సపొందుతూ..

బొండపల్లి: మండలంలోని గొట్లాం సమీపంలో ఇటీవల ఆటోలో ప్రయాణిస్తుండగా జారిపడి గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. నెలిమర్ల మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కురమయ్యగారి కామరాజు (73) గతనెల 31న తన కుమారుడు సత్యనారాయణతో కలిసి బంధువులు శుభకార్యానికి బొండపల్లి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా గొట్లాం వద్ద ఆటోలో నుంచి జారిపడి గాయపడ్డాడు. దీంతోకామరాజును జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. కామరాజు కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ ప్రాంతంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని గుర్తింపునకు పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో ఉంచనున్నట్లు తెలిపారు. సమాచారానికి 9121109469, 9505681057 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ పి.సూర్యకుమారి సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..ఇంటర్ చదువుకొన్న బాలిక ఇంటిదగ్గరే ఉంటోంది. అయితే ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు టీవీచూస్తుండగా పాత్రలు శుభ్రం చేయడానికి పేర్కొని బాలిక బయటకు వెళ్లింది. అయితే సమయం గడుస్తున్నా బాలిక ఇంట్లోకి రాకపోవడంతో బయటకు వచ్చివెతికారు. బాలికను కొత్త భీమిలి మండలం మూలకుత్తు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లినట్లు అనుమానంగా ఉందని బాలిక తండ్రి సరగడ ఎర్రయ్యరెడ్డి ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

స్కూటీ దొంగతనంపై...

భోగాపురం మండలంలోని మహారాజపేట జాతీయరహదారిపై స్కూటీ దొంగిలించినట్లు విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన కె.శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు సీఐ ఎ.రవికుమార్ సోమవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. కొమ్మాదికి చెందిన శ్రీనివాసరావు ఈనెల నాలుగోతేదీ రాత్రి శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం వెళ్లేందుకు కొమ్మాది నుంచి స్కూటీపై బయలుదేరాడు. మహారాజపేట జాతీయరహదారిపైకి వచ్చే సరికి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం ఆసుపత్రికి వెళ్లిపోయాడు.అనంతరం స్కూటీకోసం రాగా అక్కడ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు.ఈమేరకు కేసునమోదు చేశారు.

సారా ఊటలు ధ్వంసం

గుర్ల: మండలంలని దేవునికనపాక, ఇంటిపేట, గవిడిపేట, రెడ్డిపేట, ముద్దాడపేట, మునకాలపేట తదితర ప్రాంతాల్లో సారా తయారుచేస్తున్న స్థావరాలపై గుర్ల ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్‌ఐ మాట్లాడుతూ సుమారు వెయ్యి లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.సారా తయారుచేసినట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దేవునికనపాక ప్రాంతాల్లో సారా తయారీకేంద్రాలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే మానుకోవాలని గ్రామస్థులకు కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

బొండపల్లి: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. గజపతినగరం మండలం నుంచి అక్రమంగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

వేడుకగా పంచాంగ శ్రవణం

● ఏజెన్సీలో అమావాస్య రోజు నిర్వహణ

ఏజెన్సీ ప్రాంతంలోని రచ్చబండలు, ఆలయాల వద్ద ఉగాది ముందు రోజు అమావాస్య పురస్కరించుకుని సోమవారం పంచాంగ శ్రవణాన్ని వేడుకగా నిర్వహించారు.ఈ సందర్భంగా రానున్న ఏడాది కాలంలో ఆదాయ వ్యయాలు, వర్షపాతం తదితర వివరాలను వేదపండితులు వివరించారు. గిరిజనులు ఉగాది వేడుకలు సందడిగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు.



భామిని: భామినిలో పంచాంగ శ్రవణం చేస్తున్న లలితా ప్రసాదశర్మ



పార్వతీపురం రూరల్: వెంకమ్మపేటలో...

● **పార్వతీపురం రూరల్:** మండలంలోని వెంకమ్మపేట, ఎం ఆర్‌నగరం తదితర గ్రామాల్లో శ్రీక్రోధి తెలుగు ఉగాది సంవత్సరం పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఏ రాశి ఫలం ఎలా ఉంటుందో ఎవరు పరిస్థితి ఈకొత్త సంవత్సరంలో ఎలా ఉంటుందో వివరించారు. పేర్లను బట్టి రాశుల ఫలాలను వివరిస్తూ ఆదాయం అంతా ఖర్చు ఎంత రాజపూజ్యం ఎంత అవమానం ఎంత అన్న వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● **వీరఘట్టం:** మండలంలోని విక్రంపురంలో శ్రీ క్రోధినామసంవత్సర పంచాంగ శ్రవణాన్ని రైతులకు పురోహితులు వివరించారు. ప్రతి ఏటా గ్రామాల్లోనూ రైతులు ఉగాది ముందు రోజు రామమందిరం వద్దకు చేరి పురోహితుల ద్వారా పంచాంగ శ్రవణాన్ని వినడం సంప్రదాయ బద్ధంగా వస్తోంది. సంవత్సర కాలంలో రాశిఫలాలు, ఆదాయ వ్యయాలు, వర్షపాతం, పంటల దిగుబడులు తదితర వివరాలను పురోహితులు రైతులకు వివరించారు.

● **గరుగుబిల్లి:** గరుగుబిల్లి, గొట్టివలస, రాయవలస, నాగూరు, రావుపల్లి తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య పురస్కరించుకుని రామాలయాల వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. తొలుత గ్రామ పురోహితులు విఘ్నేశ్వర పూజ, అనంతరం ఉగాది నుంచి వచ్చే కొత్త సంవత్సరానికి సంబంధించి రాశి ఫలాలను చదివి వినిపించారు.

● **భామిని:** భామిని, బొమ్మిక, పక్కుడిభద్ర గ్రామాల్లో వేద పండితుడు లలితా ప్రసాదశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల వారీగా రాశిఫలాలను చదివి వినిపించారు.

● **సాలూరు రూరల్:** మండలంలోని మామిడిపల్లిలో పంచాంగ శ్రవణం చేశారు. పూర్వీకుల నుంచి ఇక్కడ ఉగాదికి ముందు రోజైన కొత్త అమావాస్య నాడే పంచాంగ శ్రవణం చేస్తారు. గిరిజా రామాలింగేశ్వరాలయంలో రాత్రి గ్రామ పెద్దలు సమక్షంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం గ్రామ పురోహితుడు అందవిల్లి సూర్యనారాయణశాస్త్రి నిర్వహించారు. తరతరాలుగా కొత్త అమావాస్య నాడే పంచాంగ శ్రవణం ఆచారాన్ని కొనసాగిస్తున్నామని గ్రామపెద్ద, మామిడిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు చెప్పారు.



గరుగుబిల్లి: పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్థులు



వీరఘట్టం: రైతులకు పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పురోహితులు

నియోజకవర్గాన్ని అభివృద్ధిచేస్తా: విజయచంద్ర



వాకర్స్‌తో మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/పార్వతీపురంటౌన్: ఎన్డీఏ కూటమి నుంచి పోటీచేస్తున్న తనకు మద్దతునిచ్చి గెలిపించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ పార్వతీపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్‌క్లబ్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. దుష్టపాలనను అంతమొందించడానికి టీడీపీకిఅండగా నిలబడాలని కోరారు.తనను గెలిపిస్తే అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేస్తానని తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, సిరిపురపు భాస్కర్‌రావు, కోట మధుసూదనరావు, కోల మధుసూదన్, డాక్టర్ భాను ప్రసాద్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి: అక్కేన

గరుగుబిల్లి: కురుపాం శాసనసభ్యురాలు పాముల పుష్పశ్రీవాణి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని గరుగుబిల్లి టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు కోరారు. శాసనసభ్యురాలిగా ఎన్నికైనప్పటి నుంచి అబద్ధాలతోనే ప్రజలను మోసగించి కాలం గడిపారని ఆరోపించారు. సోమవారం నాగూరులో విలేకరులతో మాట్లాడుతూ నాగూరు, చిలకాంతో పాటు పలు గ్రామాల్లో పుష్పశ్రీవాణి ప్రచారం నిర్వహించిన సమయంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తోయక జగదీశ్వరిపై పలు ఆరోపణలు చేశారని, కూటమి అభ్యర్థికి అవగాహనలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందితే తోటపల్లి అదనపు ఆయకట్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు తెప్పిస్తామని 2014లో ప్రచార సభలో చెప్పి తదుపరి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచారన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్

పాలకొండ: పాలకొండ పెద్దకాపువీధి జడ్పీఉన్నతపాఠశాలలో మంగళ, బుధవారాల్లో ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, క్రీడాకారులు వండాన కురిమినాయుడు, గేదెల ధనుంజయ, నడుపూరు అప్పలనాయుడు, పైల సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వివరాలకు 7799040484, 86392272451, 9502283161, 798900 49398 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

టీడీపీకే ప్రజల మద్దతు: జగదీశ్వరి



సమావేశంలో పాల్గొన్న జగదీశ్వరి

కురుపాం: ప్రజల మద్దతు టీడీపీకే ఉందని ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ అభ్యర్థి తోయిక జగదీశ్వరి తెలిపారు.సోమవారం కురుపాంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వీరేష్‌దేవ్ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు కడ్రక మల్లేశ్వరరావు, బీజేపీ నాయకుడు నడుకూరు ధూళికేశ్వరరావు, శేఖర్‌పాత్రుడు, పాడి సుదర్శనరావు, అక్కేన మధుసూదనరావు, ఐదు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు

గరుగుబిల్లి: మండలంలోని గిజబలో నిర్మించిన కాశీవిశ్వేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యతో పాటు ఆలయం కొత్తగా నిర్మించడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు.

రాయగడలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న చిన్నారులు

రాయగడ : రాయగడలో బీజేడీ సీనియర్ నాయకుడు ,ఉత్కళ తెలుగు సమాఖ్య అధ్యక్షుడ వై.వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్లో భాగంగా వివిధ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా బాలలకు ఉగాదివేడుకకు సంబంధించిన చిత్రలేఖన పోటీలు ఏర్పాటుచేశారు. జూనియర్ విభాగంలో ఐ.శిరీష, నాన్సిదివ్యదాస్ నాన్సినీరజ్ ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. సీనియర్‌విభాగాంలో జీగీతిక, సాక్షిసిమ్రాన్, సుబుద్ధి జస్వంత్‌ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.విజేతలకు ఉగాది వేదికపై బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సంప్రదాయ వంటకాల ప్రదర్శన



వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు

రాయగడ: రాయగడలోని తేజస్వీ మైదానం ఉగాది వేడుకల్లో భాగంగా నెక్కంటి భాస్కరరావు అధ్యక్షతన జిల్లాఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వంటలను ప్రదర్శించారు. విజేతలను ఎంపికచేయడం కష్టంతోగా మారిందని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు.

ఆ వలంటీర్లపై చర్యలు తీసుకోవాలి

● మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్



వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్

మక్కువ: మండలంలోని పాపయ్యవలస, కాశీపట్నం గ్రామ వలంటీర్లు యామల రాంబాబు, బాగు రామకృష్ణలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఆరోతేదీన కాశీపట్నం పంచాయతీలోగల ములక్కాయవలస, మేలాపువలసల్లో వైసీపీ నాయకులు ఆధ్వర్యంలోనిర్వహించిన ఎన్నికలప్రచారంలో సంబంధిత వలంటీర్లు పాల్గొని, వైసీపీకి ఓటువేయకపోతే సంక్షేమ పథకాలు అందవని ఓటర్లను ప్రలోభ పెట్టారని తెలిపారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా వైసీపీ తరపున ప్రచారం చేసిన వలంటీర్లపై చర్యలుతీసుకోవాలని కోరారు.గతనెల 29న పనసభద్ర పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నలుగురు వలంటీర్లపై ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, నాయకులు మావుడి ప్రసాదరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, చింతల తవిటినాయుడు పాల్గొన్నారు.

ఎండలపై అప్రమత్తంగా ఉండాలి

● గరుగుబిల్లి మండల వైద్యాధికారి సాగర్‌వర్మ

గరుగుబిల్లి: గ్రామాల్లోని ప్రజలు ఎండలపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ సూచించారు. సోమవారం మండలంలోని దళాయివలసలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటుచేశారు. సురక్ష శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులతోపాటు చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశముందని తెలిపారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేలా బాలింతలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పెరిగే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ స్నిగ్ధ, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రమణమ్మ, ఉదయకుమారి, లేబ్‌టెక్నీషియన్ పి.శ్రీనివాసరావు, 104 సిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి సప్తాహ కార్యక్రమాలు

గరుగుబిల్లి: టీటీడీ మనగుడి కార్యక్రమంలో భాగంగా శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమాలు బుధవారం నుంచి ఈనెల నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచారపరిషత్‌ప్రతినిధి జె.శ్యామ్‌సుందరరావు తెలిపారు.సోమవారం దళాయివలసలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరామనవమి పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సూర్యకుమారి, తిరుపతిరావు, పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామ నవరాత్రోత్సవాలు

సాలూరు రూరల్: సాలూరులో శ్రీరామ లీలా నవరాత్రోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. మంగళవారం నుంచి ఈనెల 17 వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు పెదకోమటిపేటలో శ్రీరామాలయంలో తొమ్మిదిరోజులు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లుచేశారు.సాలూరులోని డబ్బివీధి, వెలంపేట, గాడివీధి, మెంటాడవీధి, నెయ్యిలవీధి, వేంకటేశ్వరకాలనీ, మామిడిపల్లి, పురోహితునివలసల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు.ఈమేరకు ఆలయాలు,రామమందిరాలు అలంకరించారు. ఉగాది ఉత్సవాలు నేపథ్యంలో కామాక్షిఅమ్మవారి ఆలయన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

పాఠశాలల్లో వాటర్‌బెల్

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో వాటర్ బెల్‌ను అమలు చేస్తున్నారు. వాటర్‌బెల్ నిర్వహణపై మూడు ఫొటోలు, 30 సెకన్ల నిడివి వీడియోను ఎంఈవో గ్రూప్‌లో పోస్ట్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ఈ మేరకు పాఠశాలల్లో సోమవారం ఉదయం 8.45 గంటలకు తొలి వాటర్‌బెల్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎంఈవో అధికారిక గ్రూప్‌లో ఉపాధ్యాయులు పోస్ట్‌చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా మూడుదఫాలుగా వాటర్‌బెల్ (నీరు తాగడానికివిరామం) మోగిస్తున్నారు. ఉదయం 8.45, 10.05 గంటలకు, 11.50 నిమిషాలకు వాటర్ బెల్ మోగిస్తున్నారు.

కేంద్ర బలగాలతో కవాతు



తుంబలిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలి, చినతుంబలి, రావాడ గ్రామాల్లో చినమేరంగి సబ్‌ఇన్‌స్పెక్టర్‌ఈ.చిన్నంనాయుడు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చిన్నంనాయుడు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు, ఇబ్బందులకుగురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలోవినియోగించుకోవాలని సూచించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి: కలిశెట్టి

గజపతినగరం: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీఅభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలుపనిచేయాలని విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. సోమవారం గజపతినగరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమన్వయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్న సమయంలో మెజార్టీ వచ్చిందో అదేవిదంగా ఈఎన్నికల్లో మెజార్టీ వచ్చేవిదంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలోపార్టీ నాయకులు వీవీవీ గోపాలరాజు, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ మండలాల మాజీ ఎంపీపీలు గంట్యాడశ్రీదేవి, బెజవాడ రాజేశ్వరి, కొండపల్లి కొండలరావు,జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, జనసేన పీఏసీసభ్యురాలు పడాలఅరుణ,నియోజకవర్గ సమన్వయకర్త మర్రాపు సురేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు రెడ్డి పావని పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పనిచేయాలి: కళా

చీపురుపల్లి: గ్రామాల్లో ప్రతిఒక్కరూ పనిచేసి తనను గెలిపించాలని చీపురుపల్లి కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు కోరారు. సోమవారం చీపురుపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ ఎంపీపీలు, పార్టీ నాయకులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కొంతమంది గ్రామాల్లోకి వచ్చి లేనిపోని పిట్టకథలు చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివస్తే ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ప్రజలను మభ్యపెడతారని, అటువంటి కల్లబొల్లి మాటలు నమ్మొద్దని ప్రజలకు గట్టిగా చెప్పాల్సిన బాధ్యత ఉమ్మడిపార్టీల కార్యకర్తలు, నాయకులపై ఉందని కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, రెడ్డి గోవిందబాబు, తాడ్డి సన్యాసినాయుడు, సారేపాక సురేష్, పైలబలరాం, బలగం వెంకటరావు, వెన్నెసన్యాసినాయుడు, మహంతి అప్పలనాయుడు, మహంతి రమణమూర్తి, వై. సత్యం, రమణమూర్తి, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ

గజపతినగరం: వేసవిలోరాత్రి సమయాల్లో చోరీలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగాఉండాలని సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు తెలిపారు. సోమవారం స్థానిక మండలవారికాలనీలో అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే ఫిర్యాదుచేయాలని సూచించారు. వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్తే ఇంటి నెంబర్‌తో పాటు ఇంటి యజమానుల ఫోన్ నెంబర్లు పోలీసులకు ఇవ్వడంతో సమాచారం అందజేయా లన్నారు.రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేష్‌పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయాలి

భోగాపురం: నీరును వృథా చేయకుండా పొదుపుచేయడం అలవాటు చేసుకోవాలని జలజీవన్ మిషన్ జిల్లా ఐఈసీ కోఆర్డినేటర్ జి.విజయబాబు కోరారు. సోమవారం భోగాపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ అవకాశం ఉన్న చోట, ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీరు భూమిలోకి ఇంకే విదంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ప్రతినిధులు ఎం.రామారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీమన్నార్ ఆలయంలో నేడు ఉగాది వేడుకలు

కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలను నగరంలోని శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభ మౌతుందన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మేలు

వంగర: సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని టీడీపీ నాయకులు కోండ్రు జగదీష్, పైల వెంకటరమణతో పాటు పలువురు అన్నారు. సోమవారం కోనంగిపాడులో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనంగిపాడులో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కండవాలు వేసి కోండ్రు జగదీష్ పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ హయాంలోనే రాజాం అభివృద్ధి

రాజాం: రాజాం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగాయని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కంబాల రాజవర్దన్ అన్నారు. సోమవారం రాజాం, వంగర, రేగిడి మండలాల్లో పర్యటించారు. మరలా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. బెవర సత్యంనాయుడు, ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు నష్టమే

విజయనగరం రూరల్: టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన 'బ్రాహ్మణ కార్పోరేషన్'ని ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకుడు పేరి రామయ్య పంతులు చెప్పారు. 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు సోమవారం నగరంలోని 8వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీ, అయ్యన్నకోనేరు దక్షిణ గట్టు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌పరిధిలో సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు తారకేశ్వరరావు, నరేష్, నవీన్ పడాల్ సిబ్బంది సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీ సమయంలో కన్యకాపరమేశ్వరి కోవెల సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మచిలీపట్నానికి చెందిన గులివిందల అప్పలస్వామినాయుడును విచారించగా అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో 14.23 కిలోల వెండి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని తదుపరి విచారణ నిమిత్తం మండల తహసీల్దార్‌కు అప్పగించారు. కన్యాకాపరమేశ్వరి కోవెల నుంచి గంటస్థంభం వెళ్లే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న గాజువాకకు చెందిన అర్జున్ కుమార్ మాలి పట్టుబడ్డారు. అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా 12.405 కిలోల వెండి ఆభరణాలు లభ్యం అయ్యాయి. దీనివిలువ రూ.9.36 లక్షలని వెల్లడించారు. తదుపరి విచారణ కోసం మండల తహసీల్దార్‌కు అప్పగించారు. పౌర సరఫరాల బియ్యం 18 బ్యాగులతో ఉన్న ఆటోను ఎస్‌ఐ నవీన్ పడాల్ తనిఖీల్లో పట్టుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం సీఎస్‌డీటీకి అప్పగించినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

సందడిగా ఉగాది సంబరాలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో, మండలంలో సోమవారం శ్రీ క్రోధినామ ఉగాది సంవత్సర సంబరాలను ముందురోజు సందడిగా జరుపుకున్నారు. పాత బొబ్బిలి ఒకటోవార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఉగాది సంబరాలను జరుపుకున్నారు. ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి కేంద్రానికి విచ్చేసి చిన్నారులతో మమేకం అయ్యారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కేంద్రం ఉపాధ్యాయిని ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని అలజంగి సీబీఎం పాఠశాలలో ఉపాధ్యాయుడు కె.కృష్ణదాసు ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను సరదాగా జరుపుకున్నారు. చిన్నారులంతా తెలుగుదనం ఉట్టిపడే వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఉగాది పండుగ నేపథ్యాన్ని, ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు కృష్ణదాసు వివరించారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

రేగిడి: గ్రామాల్లో ఎన్నికల నియమావళి రాజకీయపార్టీలు పాటించి వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్ ప్రజలకు హెచ్చరించారు. మండలంలో ఖండ్యాం గ్రామంలో సోమవారం ఎన్నికల నియమావళిపై ప్రజలతో చైతన్య సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని, ప్రధానంగా యువత తగువులకు దూరంగా ఉండాలని కోరారు. మద్యం, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని, వీటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. స్థానిక సిబ్బంది ఉన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు

తెర్లాం: మండలంలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. నియెజకవర్గ టీడీపీ అభ్యర్థి బేబీనాయన ఆదేశాల మేరకు నెమలాం, గ్రామంలో బాబు సూపర్ సిక్స్ పథకాల పై గ్రామ తెదేపా నాయకులు అవగాహన కల్పించారు. గడప గడపకు వెళ్లి అవగాహన కల్పించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ, జగన్ చేసే మోసాల్ని తెలియజేశారు. వైసీపీని ఓడించాలని, చంద్రబాబు రాకపోతే రాష్ట్రం అదోగతి పడుతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే 4వేలు పింఛన్ ఇస్తారన్నారు. గ్రామ టీడీపీ నాయకులు కోనారి రమేష్, బందాపు శివుడు, ఇద్దుబోను పారినాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌పై అవగాహన సదస్సు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 8: ప్రస్తుత మార్కెట్‌లో ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ విలువ పెరుగుతున్నదని బెంగుళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఐఈఈఈ' విద్యార్థి విభాగం సంయుక్త నిర్వహణలో ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది మధ్య కాలంలో సీఏజీఆర్ వద్ద ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ 21.5 శాతం మేర పెరుగుతుందన్నారు. వేగవంతమైన, మరింత శక్తి సామర్థ్యాలు కలిగిన పరికరాలను రూపొందించడానికి ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వీటిలో ప్రాథమిక అప్లికేషన్ ఫైబర్-ఆప్టిక్ కమ్యూనికేషన్‌లో వుందన్నారు. బయోమెడికల్, ఫోటోనిక్ కంప్యూటింగ్ వంటి ఇతర రంగాలలో అప్లికేషన్స్ కూడా సాధ్యమేనన్నారు. కార్యక్రమం అనంతరం ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌ని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కె వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, సీనియర్ అధ్యాపకులు బి నళిని, కె బాబులు, కెసీబీ రావు, ఆర్ గురునాథ్, టీఎస్ఎన్ మూర్తి, ఎం హేమ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే అరగంటలో కేసు

● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 8: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఘటనలపై అరగంటలో కేసు నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టాలన్నారు. వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడ్ అమల్లోకి వచ్చి సుమారు 22 రోజులు గడిచిపోయినా క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఇంకా చురుగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫిర్యాదు వస్తేగాని స్పందించరా అంటూ నిఘా వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లిప్తత విడిచి పెట్టాలని, పని తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌టీఎఫ్‌లకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇస్తామని, అప్పటికీ కేసులు నమోదు చేయక పోతే చర్యలు తప్పవన్నారు. క్షేత్ర స్థాయిలో విస్తృతంగా కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, రాజకీయ పార్టీల సమావేశాల్లో తాగునీరు, మజ్జిగ మినహా ఇంకా ఏది పంచినా, భోజనాలు పెట్టినా కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో నగదును సీజ్ చేసుకున్న ఘటనలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇతర వాహనాలతోపాటు బస్సులు కూడా విస్తృతంగా తనిఖీ చేయాలని సూచించారు.

నిఘా పెంచండి

ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు లావాదేవీలు, రవాణా జరగకుండా నిఘా పెంచాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సీజర్స్ పెంచి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కలెక్టర్ చాంబర్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని రకాల ప్రలోభాలను అరికట్టడానికి నిఘా పెంచాలని ఆదేశించారు. నగదు, మద్యం, వి విధరకాల పరికరాలు, వస్తువులు, వస్త్రాలు, ఆభరణాల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ రూ 17.84 లక్షలు నగదు, 29,148 లీటర్లు మద్యం, రూ 29.35 లక్షలు విలువైన డ్రగ్స్, రూ.10.38 లక్షల విలు వైన లోహ పరికరాలు, 31.01 లక్షలు విలువైన సామగ్రి కలిపి మొత్తం 1,17,32, 501 విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జేసీ కార్తీక్, డీ ఆర్వో అనిత, సీపీవో బాలాజీ, ఏఎస్పీ ఆస్మాపర్వీన్, నోడల్ అధికారులు డాక్టర్ సత్య ప్రసా ద్, అరుణ కుమారి, అరుణ శ్రీ, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు.. పేదలకు వరం



ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న అదితి

విజయనగరం రూరల్: పేద ప్రజలకు మేలు చేసేందుకే చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు తీసుకొచ్చారని విజయనగరం నియోజక వర్గం కూటమి అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం నగరంలోని 32వ డివిజన్ తోటపాలెం, వైఎస్ఆర్ నగర్, గాయిత్రీ కాలేజే తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, తెలుగు దేశం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రచారంలో బాగంగా స్థానిక ఓ మహిళా తన బిడ్డకు పేరుపెట్టాలని కోరాగా దేవాన్ష్‌గా నామకరణం చేశారు.

● టీడీపీ మహిళా విభాగం నగరంలోని అన్ని డివిజన్లలో నిర్వహించిన సమావేశాలకు మంచి స్పందన లభించడంతో ఈ కార్యక్రమాన్ని విజయనగరం మండల పరిధిలో కూడా చేపట్టాలని అదితి గజపతిరాజు మహిళా నేతలకు సూచించారు. తాజాగా ఈ నెల 11 నుంచి విజయనగరం మండలంలో కూడా టీడీపీ మహిళా విభాగం నాయకులు పర్యటించి, రెండేసి గ్రామాల చొప్పున ఒక ప్రాంతంలో ఈ సభలు ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను అదితి గజపతిరాజు సమక్షంలో సోమవారం ఖరారు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..



టీడీపీలో చేరిన వీరసాగరం గ్రామస్థులతో బేబీనాయన

బొబ్బిలి, ఏప్రిల్ 8: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బాడంగి మండలం వీరసాగరం గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాల వారు బొబ్బిలి కోటకు వచ్చి టీడీపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ బేబీనాయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన నాయకులు చల్ల శ్రీను, మాజీ ఎంపీటీసీ మరిపి శంకరరావు, గొర్లె తౌడు, గండి శ్రీకాంత్, వంగపండు గోపాలరావుల ప్రోద్బలంతో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో వీరసాగరం గ్రామానికి చెందిన వార్డు మెంబరు గొర్లె త్రినాథ, డోకల వేణు, నడిమింటి సత్యవతి, డోకల సత్యవతమ్మ, మడక పోలినాయుడు, పెంట పెదపోలిశెట్టి, యజ్జల అప్పారావు, అల్లబోయిన సింహాచలం తదితరులు ఉన్నారు. సోమవారం రాత్రి గొర్లె సీతారంగపురం పంచాయతీ విజయపురి, కాశిందొర వలస, మోతూరు వలస గ్రామాలకు చెందిన 40 ఎస్టీ కుటుంబాలు బేబీనాయన ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. సర్పంచ్ గొర్లె ఈశ్వరప్రసాద్, ఉపసర్పంచ్ జన్ని ఆదయ్య, అల్లాడ భాస్కరరావు, వాశిరెడ్డి సత్యనారాయణ సింగనాపల్లి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

లింగ నిష్పత్తి సమానంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మగ, ఆడ శిశువుల నిష్పత్తి సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలన్నారు. ప్రస్తుతం ప్రతి వేయి మందికి 943 మంది ఆడ శిశువులే ఉన్నారని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఈ నిష్పత్తి ఇంకా తక్కువగా ఉందన్నారు. దీనిని అరికట్టాల్సి ఉందని, ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువు అని తెలిసి గర్భస్రావం చేయించినట్లు తెలిస్తే 102, 104, టోల్ ఫ్రీ నెంబర్ లేదా ఆన్‌లైన్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని ఆయన తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు వినోద్‌కుమార్, కమలకుమారి, ఐఎంఏ ప్రెసిడెంట్ వివేక్ తదితరులున్నారు.

మంత్రి బొత్స తీరు సరికాదు

శృంగవరపుకోట: ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కుటుంబంపై మంత్రి బొత్స సత్యనారాయణ తీరు సరికాదని వైస్ ఎంపీపీ, టీడీపీ నేత ఇందుకూరి సుధారాజు అన్నారు. మంగళవారం శృంగవరపుకోటలో విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. తామేప్పుడో ముసుగు తీసేశామని, వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిపోయామని తెల్చి చెప్పారు. మా సమస్యలను వినే తీరిక లేని మంత్రి ఇప్పుడు పార్టీ మారిన మమ్మల్ని విమర్శిస్తున్నారని, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే గెలవరని పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదని, పార్టీలో ఉంటే ఉండండి.. లేదంటే పోండని మంత్రి అనడంతో టీడీపీలో చేరామన్నారు. మేము టీడీపీలో చేరడంతో భయపడిన మంత్రి ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. ఎంపీపీ సండిసోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, నాయకులు మోపాడ గౌరినాయుడు తదితరులున్నారు.

ఎస్.కోట టీడీపీలో సమసిన వివాదం

● 'స్వతంత్ర' ఆలోచన విరమించుకున్న గొంప కృష్ణ



కోళ్ల లలిత కుమారి, గొంప కృష్ణలకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్

శృంగవరపుకోట, ఏప్రిల్ 8: శృంగవరపుకోట తెలుగుదేశంలో ఏర్పడిన వివాదం సమసిపోయింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగాలన్న ఆలోచనను విరమించుకున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం శృంగవరపుకోట గాయిత్రి మాత ఆలయం వెనకున్న కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి గెలుపుతో పాటు విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ గెలుపునకు ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. ఎస్.కోట శాసన సభ నియోజకవర్గం నుంచి టీడీపీ టిక్కెట్‌ను గొంప కృష్ణ ఎన్ఆర్ఐ కోటాలో ఆశించిన సంగతి తెలిసిందే. అయితే అధిష్టానం మాత్రం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ,మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికు టిక్కెట్ కేటాయించింది. దీంతో గొంప కృష్ణ తీవ్ర అసంతృప్తికు లోనయ్యారు. టీడీపీ రెబల్‌గా పోటీలో వుండాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో పార్టీకి నష్టం జరుగుతుందన్న విషయం తెలుసుకున్న చంద్రబాబు నాయుడు, యువ నేత నారాలోకేష్, విశాఖ ఎంపి అభ్యర్థి ఎం.శ్రీభరత్ సముదాయించారు. తగిన గుర్తింపు, గౌరవం వుంటుందని భరోషా ఇచ్చారు. గొంప కృష్ణ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలతోనూ ఆదివారం సాయంత్రం విశాఖ పార్టీ కార్యాలయంలో ఎంపీ శ్రీభరత్ చర్చించారు. దీంతో విబేదాలు విడనాడి పార్టీ విజయం కోసం పని చేసేందుకు అంగీకరించారు. శాసన సభ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

40 ఏళ్లగా టీడీపీకి అండగా బీసీలు

శృంగవరపు కోట: బీసీలు టీడీ పీకి 40 సంవత్సరాలుగా అండగా ఉన్నారని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం శృంగవరపు కోట శ్రీదార గంగమ్మ కల్యాణ మండ పంలో జయహో బీసీ సభను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో బీసీలను ఉద్దేశించి మాట్లాడారు. బీసీల అభి వృద్ధి ధ్యేయం గా అన్న ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారని, పేదలకు కిలో రెండు రూపాయలకే బియ్యం, వస్త్రాలు, పలు సంక్షేమ పథకాలు అందించా రని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సండిసోమే శ్వరరావు, వైస్‌ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నానిగిరి రమణాజీ, నా యకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రాజధాని లేకుండా చేశారు: కోండ్రు



ఒమ్మిలో మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం, ఏప్రిల్ 8: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యం చేశారని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం రాజాం మండలం ఒమ్మి గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంగా వెంకటరావు దుప్పలపూడి శ్రీనివాసరావు గురవాన నారాయణరావు, రఘుమండల గణపతినాయుడు మాడుగుల జయరాం, బి.విష్ణు, పొన్నాడ భీమేశ్వరరావు, పొట్టా చిట్టిబాబు, పొట్నూరు లక్ష్మణరావు, కొప్పల ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం అమలు చేసి పేదలందరూ ఇళ్ల కట్టుకోవడమే లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. సంతకవిటి మండలం గోళ్లవలస గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని తూర్పుకాపు సంక్షేమ సంఘం మాజీ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కొప్పల శ్రీరాములు, వెంకటమురళీ, వావిలపల్లి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: జగన్ ఐదేళ్లపాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని కోండ్రు మురళీ అన్నారు. మండలంలో కొండవలసలో సోమవారం సాయంత్రం మండల టీడీపీ శ్రేణులతో జయహో బీసీ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోండ్రు పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించి ముందుగా బీసీలకు ఈ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్వహణ

రాజాం: వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కష్టాలు ఏర్పడ కూడదనే ఉద్దేశంతో గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ సోమవారం చేపట్టినట్లు ఏడీఈ మాధవరావు, ఏఈ కుమార్ తెలిపారు. నిర్వహణ చేసిన సమయంలో ఉన్న లోపాలన్నింటినీ సరిచేశామన్నారు.

బియ్యానికే పరిమితమా?

● రేషన్‌లో అందని కందిపప్పు, గోధుమలు
● పండగ నాడు పేదలకు తప్పని అవస్థలు



దత్తిరాజేరు: పేదల ఇంటివద్దకే ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నామని జగన్ ఆర్భాటంగా గొప్పలు చెప్పారు. కోట్ల రూపాయలు ఖర్చుచేసి సిబ్బందిని నియమించామన్నారు. ఇదంతా కేవలం బియ్యం ఇవ్వడానికేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 5, 81,208 కార్డుదారులున్నారు. వీరందరికీ ప్రభుత్వం రేషన్‌లో భాగంగా బియ్యం, పంచదార, కందిపప్పు, రాగిపిండి, గోధుమలు, నిత్యవసరాలను అందించాల్సి ఉంది. కానీ కేవలం కేంద్రం అందిస్తున్న బియ్యానికి తోడుగా కొద్దిమేర పంచదార, రాగిపిండి ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. గోధుమలు, కందిపప్పు, ఇతర నిత్యావసరాలు ఇవ్వకపోవడంతో పేదలంతా గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పండుగకు కూడా పప్పు ఇవ్వకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇలాంటి సమయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అరకొర సరుకులు అందించడంతో పేదలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు.

1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాలద్వారా సరుకుల పంపిణీ కొనసాగుతోంది. కందిపప్పు, గోధుమ పిండి పంపిణీలేదు. బియ్యం ఒక్కటే పరిపూర్ణంగా అందుతోంది. పంచధార అరకొరగా సరఫరా చేస్తున్నారు. సుమారు 3 నెలల నుంచి కందిపప్పు, గోధుమలను పూర్తిగా అందించడం లేదు. పౌర సరఫరా ద్వారా రూ.67లకే అందించే కిలో కందిపప్పు బయట మార్కెట్‌లో సుమారు రూ.160 నుంచి 180 వరకు ధర పలుకుతోంది. ఇంత ధర పెట్టి పండగకు మధ్య దిగువ తరగతి కుటుంబసభ్యులు కందిపప్పు కొని తినలేని పరిస్థితి నెలకొంది. ఏ ఒక్క నెల కూడా సరుకులు పూర్తిగా అందించిన పరిస్థితి లేదని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. ఉగాది పండుగ నాటికి సరుకులు సరఫరా చేసేందుకు వీలుగా గోదాముల్లో ఎలాంటి నిల్వలు లేవని, ఇంకెప్పుడు ఇస్తారని అడుగుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

కందిపప్పు కొద్దినెలలుగా రావడం లేదు. అందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉగాది పండుగకు ప్రతి లబ్ధిదారునికి బియ్యం, చక్కెర, రాగిపిండి అందేలా చర్యలు చేపడుతున్నాం. నిత్యవసర వస్తువులు గోదాముకు చేరిన వెంటనే పేదలకు అందేలా చర్యలు తీసుకుంటాం.

– ధనం, సీఎస్‌డీటీ, దత్తిరాజేరు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బంగారయ్య (ఫైల్)

వేపాడ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ శివారు చిట్టివానిపాలెంకి చెందిన కంబాల బంగారయ్య (58) గత నెల 16న చింత బొట్టలు దులిపేందుకు చింతచెట్టు ఎక్కాడు. ఘటనలో బంగారయ్య ప్రదావశాత్తు కాలుజారి పడి పోగా తలకు బలమైన గాయం తగిలింది. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కి తీసుకువెళ్లి జాయిన్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. బంగారయ్యకు భార్య ఎర్రయ్యమ్మ, కుమారులు పెంటయ్య, అర్జున్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. . బంగారయ్య గతంలో కొండగంగుబూడి గ్రామ ఉప సర్పంచ్‌గా పదవి నిర్వహించారు. ఆయన మృతిపై ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు చల్లా జగన్‌తో పాటు పలువురు అధికారపార్టీ నాయకులు తీవ్ర సంతాపం తెలియజేశారు.

మద్యం సీసాలు పట్టివేత

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో మూడు వేర్వేరు కేసుల్లో 147 మద్యం సీసాలను సోమవారం పట్టుకుని నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక బలిజిపేటరోడ్డులో అలజంగి గ్రామానికి చెందిన యాండ్రాపు శ్రీనివాసరావు దగ్గర 9100 రూపాయల విలువ చేసే 70 మద్యం సీసాలు, చర్చిసెంటరులో గొల్లపల్లి గ్రామానికి చెందిన బోగాది సత్యనారాయణ దగ్గర 6,110 రూపాయల విలువ చేసే 47 మద్యం సీసాలు, ప్రసాద్‌నగర్‌కాలనీలో కోమటిపల్లి గ్రామానికి చెందిన రైతు సింహాచలం దగ్గర 3,900రూపాయల విలువ చేసే 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, నిందితులను అదుపులోనికి తీసుకున్నామని సీఐ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ లోవరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ● **రేగిడి:** పోలీసుల తనిఖీలో 17 మద్యం సీసాలు పట్టుబడినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ స్థానిక విలేఖర్లకు తెలిపారు. కాగితాపల్లి షాపు నుంచి తెస్తున్న మద్యం సీసాలను ఉణుకూరు వద్ద తనిఖీ చేస్తుండగా గంగాడకు చెందిన నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని రాజులరామచంద్రపురం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 240 మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు స్టేషన్ బూర్జివలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్న కుమార్ తెలిపారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని విలేకర్లకు తెలిపారు.

కొత్తరేగ శివాలయంలో హుండీ చోరీ

రామభద్రపురం: మండల పరిధిలోని కొత్తరేగ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శివాలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడి హుండీ దోచుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. హుండీలో ఎంతనగదు ఉంది? అనే విషయంపై ఆరా తీస్తున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలికకు గాయాలు

కలెక్టరేట్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఓ బాలిక ఆదివారం సాయంత్రం ఉతికిన బట్టలను గట్టుపై ఆరబెడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి, కింద ఉన్న కాలువలో పడిపోయింది. వెంటనే పాఠశాల సిబ్బంది విశాఖపట్టణం కేజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. గంట్యాడ మండలం డీకే పర్తి గ్రామానికి చెందిన ఆ బాలిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతుంది. మూడు అడుగుల కాలువలో పడిపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై గిరిజన సంక్షేమ శాఖ డీడీ చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా బాలిక ఆరోగ్య పరిస్థితి బాగుందని, వసతి గృహానికి తీసుకుని వచ్చామని, అన్ని రకాల పరీక్షల కోసం కేజీహెచ్‌కు తరలించామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రేగిడి: మండలంలో బూరాడ సెంటర్‌లో కారు ఢీకొని ఇదే గ్రామానికి చెందిన వావిలిపల్లి సత్యంనాయుడు, చల్లపల్లి రాములు గాయపడ్డారు. రాజాంలో ప్రైవేటు గ్యాస్ ఏజెన్స్‌లో పనిచేస్తున్న వీరు స్వగ్రామం బూరాడ దిచక్రవాహనంపై వస్తుండగా, పాలకొండ నుంచి రాజాం వస్తున్న కారు వీరిని బలంగా ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. వీరద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆటోలో రాజాం ఆసుపత్రికి తరలించారు. ఇంకా ఈ ఘటనపై సమాచారం అందాల్సి ఉందని స్థానిక పోలీసులు తెలిపారు.

కోడి పందేలపై దాడి

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ సమీపంలో గల క్వారీల వద్ద నిర్వహిస్తున్న కోడి పందెం శిబిరంపై వల్లంపూడి పోలీసులు దాడిచేసి ఇద్దరు వ్యక్తులను పట్టుకోవడంతో పాటు రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత ప్రయాణాలు సాగించాలి: డీఎస్పీ



వాహనదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ

బొబ్బిలి, ఏప్రిల్ 8: అన్ని రకాల వాహనదారులు ప్రమాదరహితమైన ప్రయాణాలను సాగించాలని డీఎస్పీ హితవు పలికారు. స్థానిక పాతబొబ్బిలి జంక్షన్‌లో సోమవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసరావు వాహనచోదకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రహదారి భద్రతకు సంబంధించి అనేక సూచనలు చేశారు. ద్విచక్రవాహనదారులంతా హెల్మెట్ ధరించాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణించరాదని, అతివేగం మానుకోవాలని హితవు పలికారు. కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. రహదారి భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. కుటుంబ సభ్యుల సంక్షేమం వారి భవిష్యత్ కోసం వాహనదారులంతా బాధ్యతాయుతంగా వాహనాలను నడుపుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నిషేధిత సామగ్రిని గాని, లెక్కల్లో లేని నగదు ఇతర వస్తువులను రవాణా చేయరాదన్నారు. వాహనాల తనిఖీలో అలాంటివి బయటపడితే తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ జి.లోవరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు



వాహనాల తనిఖీల్లో సీఐ రామారావు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 8: జిల్లా కేంద్రంలో మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే, తనిఖీల్లో పట్టుబడితే, తల్లి దండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. సోమవారం టూటౌన్ పరిధిలోని నల్లచెరువు రోడ్డు, దాసన్నపేట, రింగురోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లైసెన్సులు లేకుండా వాహనం నడుపుతూ, 20 మంది మైనర్లు పట్టుబడ్డారు. వీరు నడుపుతున్న వాహనాలను స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగు నిర్వహించి, హెచ్చరించి పంపారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ, ప్రతి రోజూ అన్ని ప్రధాన రహదారుల్లో తనిఖీలు నిర్వహిస్తామని, ట్రిబుల్ రైడింగ్, మైనర్లు పట్టుబడితే, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రాజేష్, ఏఎస్ఐ పైడితల్లి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోండి

రాజాం: ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర కోరారు. సోమవారం సంతకవిటి మండలంలో సమస్యాత్మక గ్రామాలైన మండాకురిటి, వాల్తేరు, మామిడిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులు ఎటువంటి అల్లర్లు చేయకుండా నిరోధించడానికి ఈ ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్నామన్నారు. కేంద్ర బలగాలతో పాటు సంతకవిటి పోలీసులు పాల్గొన్నారు. ● **తెర్లాం:** గ్రామాల్లో ప్రశాంత పోలింగ్ జరగాలని స్థానిక ఎస్.ఐ రమేష్ అన్నారు. సోమవారం ఆయన జగన్నాథవలసలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలంతా ప్రశాంతంగా జరగాలని, ఎటువంటి రాజకీయ తగాదాలు పెట్టుకోరాదన్నారు. ఓటును నిర్భయంగా వేసేందుకు ప్రజలకు భరోసా కల్పించడమే పోలీసుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు, ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

రాజాం రూరల్: ఈనెల 3 నుంచి 8 వరకూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేశామని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికచేసిన 47 కేంద్రాల ద్వారా 7959 మందికి రూ.2కోట్ల 32 లక్షల 78 వేలు పంపిణీ చేశామని తెలిపారు.